## In Andhra Jyothi



# హైవేలుగా మరో 705 కి.మీ.

### కేంద్ర సర్కారు గుర్తింపు

### రీజనల్ రింగ్ రోడ్డుకు మార్గం సుగమం: తుమ్మల

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 705 కిలోమీటర్లను జాతీయ రహదారులుగా గుర్తించడానికి కేంద్రం అంగీకరించింది. ఈ మేరకు గురువారం కేంద్ర రోడ్లు

మిగతా 3వ పేజీలో

ఆంధ్రజ్యోతి Fri, 25 November
epaper.andhrajyo

## Contd....

# హైవేలుగా మరో 705 కి.మీ

(మొదటిపేజీ తరువాయి)

రవాణా, రహదారుల శాఖ డైరెక్టర్ మాయ ప్రకాష్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ రోడ్ల అభివృద్ధి పనుల కోసం వెంటనే సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లను పంపాలని కేంద్రం కోరింది. ఈ రోడ్ల అభివృద్ధికి రూ.3 వేల కోట్ల వ్యయం కాగలదని అంచనా వేస్తున్నారు. ఈ నిధులను కేంద్రమే భరించనుంది. తర్వాత రోడ్ల నిర్వహణకయ్యే వ్యయాన్ని కూడా కేంద్రమే సమకూర్చనుంది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు చొరవతోనే కేంద్రం ఈ రోడ్లను జాతీయ రహదారులుగా గుర్తించిందని తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఈ సందర్భంగా కేంద్రానికి, ముఖ్యమంత్రికి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోడ్ల అభివృద్ధి వల్ల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలనుకున్న రీజనల్ రింగ్ రోడ్(ఆర్ఆర్ఆర్) నిర్మాణం మరింత సులువవుతుందని అభిప్రాయపడ్డారు. త్వరలోనే డీపీఆర్‌లను రూపొందించి కేంద్రానికి పంపుతామని తుమ్మల తెలిపారు. కాగా కొత్తగా కేంద్రం గుర్తించిన జాతీయ రహదారుల్లో సంగారెడ్డి-నర్సాపూర్-గజ్వేల్-జగదేవ్‌పూర్- భువనగిరి-చౌటుప్పల్ వరకు 152.05 కిలోమీటర్లు, చౌటుప్పల్-ఇబ్రహీంపట్నం-అమన్X గల్-షాద్‌నగర్-చేవెళ్ల-శంకరపల్లి-కంది వరకు 186 కిలోమీటర్లు, మెదక్-సిద్దిపేట-ఎల్కతుర్తి వరకు 133 కిలో మీటర్లు, హైదరాబాద్‌లోని అవుటర్ రింగ్‌రోడ్ ఘట్‌కేసర్ జంక్షన్X నుంచి వలిగొండ-తొర్రూర్-నెల్లికుదురు-మహబూబాబాద్-ఇల్లెందు-కొత్తగూడెం వరకు 234 కిలోమీటర్ల రోడ్లు ఉన్నాయి. ఇప్పటికే ఉన్న అవుటర్ రింగ్‌రోడ్ చుట్టూ రీజనల్ రింగ్ రోడ్డును (ఆర్ఆర్ఆర్)ను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇది సుమారు 330 కిలోమీటర్ల వరకు ఉండొచ్చని తెలుస్తోంది. అయితే ప్రస్తుతం కేంద్రం గుర్తించిన రహదారులు కూడా ప్రతిపాదిత ఆర్ఆర్ఆర్ పరిధిలోనే ఉండటంతో దీని నిర్మాణానికి మార్గం ఏర్పడినట్టయింది. కేంద్రం ఈ రోడ్లను అభివృద్ధి చేస్తే ఆర్ఆర్ఆర్‌ను దాదాపు పూర్తి చేసినట్టవుతుంది. అలాగే హైదరాబాద్ ఓఆర్ఆర్ నుంచి తర్వాత ఆర్ఆర్ఆర్ నుంచి అన్ని జిల్లాలకు రోడ్ల సదుపాయం అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం కేంద్రం ప్రకటించిన రోడ్లను పూర్తి చేస్తే.. ఘట్‌కేసర్ అవుటర్ రింగ్ రోడ్ నుంచి ఏకంగా కొత్తగూడెం వరకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలో 5 వేల కిలోమీటర్ల మేర జాతీయ రహదారులున్నాయి. మరో 2,600 కిలోమీటర్లను ఎన్X హెచ్X పరిధిలోకి తీసుకువచ్చే ప్రతిపాదనలు కేంద్రం పరిశీలనలో ఉన్నాయి. తాజాగా జాతీయ రహదారులుగా కేంద్రం తీసుకున్న 705 కిలోమీటర్ల రోడ్లతో రాష్ట్రంలో పరిస్థితి మరింత మెరుగు పడుతుందని మంత్రి తుమ్మల అభిప్రాయపడ్డారు. వచ్చే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలోని ప్రతీ రోడ్డును అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు.

ఆంధ్రజ్యోతి Fri, 25 November 2016
epaper.andhrajyothy.com//c/14895751